

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

**అన్నయ్య ఉదయాన్నే లేపాడు**. నా అంతట నేను లేవకపోవడం ఇది మొదటిసారి. చాలా దిగులుగా అనిపించింది. ఏడుపుకూడా వచ్చింది. అన్నయ్యతో మాట్లాడితే కళ్ళనుండి నీళ్ళు కారుతాయని తెలుసు, అందుకే అన్నీ ఒక్క పదం సమాధానాలు మాత్రమే ఇచ్చాను. ఎయిర్‌పోర్ట్ చేరాక అన్నయ్య నేను సెక్యూరిటీ చెక్‌లోకి వెళ్ళేంత వరకు ఉన్నాడు. లైన్‌లో నిలబడడం అంటే అన్నయ్యని మళ్ళీ ఓ నెల లేక రెండు నెలలదాకా చూడలేను అని అర్థం. చివరిలో ఏడుపుని దిగమింగుకోలేకపోయాను. అన్నయ్య ఓదార్చే కొద్దీ ఏడుపు పెరిగింది. దాంతో ఇలాకాదని వెళ్ళిపోయాను. నేను సెక్యూరిటీ చెక్ పూర్తి చేసి లోపలికి వెళ్ళేదాకా అన్నయ్య అక్కడే ఉన్నాడు. ఫ్లైట్ ఎక్కాకకూడా ఏడుపు ఆగలేదు. అన్నయ్య కంప్యూటర్ నుండి ఎక్కిచ్చుకున్న ఇంగ్లీష్ పాటలు వింటూ నిద్రపోయాను. లాండ్ అయ్యాక వెన్నెలని చూసి ఏడుపు ఆగింది.

"అయ్యో, మీ అన్నయ్యని మిస్ అవుతున్నావా?" అడిగింది.

"ఔను" దిగమింగిన ఏడుపంతా బయటికి వచ్చింది. ఓ ఐదు, పదినిమిషాల తరవాత ఇంటికి బయలుదేరాము. వెన్నెల ఓదార్చే ప్రయత్నం చేసింది. అంతసేపు పడుకున్నా, విచిత్రంగా ఇల్లు చేరగానే నిద్రపోయాను.

ఉదయం లేచేసరికి దిగులు కాస్త తగ్గింది. వెంటనే హనీషకి ఫోన్ చేసి దాదాపు గంట మాట్లాడాను. మాట్లాడినంతసేపు బాగానే అనిపించింది కానీ ఫోన్ పెట్టేసాక దిగులు మళ్ళీ కలిగింది. వెంటనే ఇండియాలో ఒక ఫ్రెండ్‌కి ఫోన్ చేసాను. తను తన నైట్ షిఫ్ట్ ఉద్యోగంలో ఉన్న ఇబ్బందుల గురించి చెప్పింది. ఆ తరువాత దిగులు కలిగేలోపు గదిలోంచి బయటకి వచ్చేసాను. కేంపస్‌లో నడుస్తుండగా ఒక ఇండియన్ అమ్మాయిని వాళ్ళ పేరెంట్స్ డార్మ్ ముందు దింపి, కాసేపు కౌగిలించుకుని వెళ్ళిపోయారు. తల్లిదండ్రులు దింపారంటే వాళ్ళు ఈ ఊళ్ళోనే ఉండి ఉండచ్చు. అయినా ఆ అమ్మాయి కళ్ళు తడిగా ఉండడం చూసి ఆశ్చర్యపోయాను. మా అమ్మ వాళ్ళు కూడా ఇదే ఊళ్ళో ఉంటే ఎంత బావుండేదో.

సాయంత్రం కొంతమంది క్లాస్‌మేట్స్‌ని కలిసాను.

"నీగ్రేడ్స్ చూసావా?" అడిగారు.

"లేదు" బదులిచ్చాను.

"అదేంటి? నిజంగా చూడలేదా?" ఆశ్చర్యపోయారు.

"నాకు తెలీదు వచ్చాయని."

ఏ లోకంలో ఉన్నావు అన్నట్లు చూసి "చెక్ చేసుకో" అన్నారు.

వెంటనే ఫోన్‌లో ఓపెన్ చేసి చూసాను.

"ఒక ఏ మైనెస్ ఉంది" కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"మిగిలినవి?"

"ఏ"

"బానే వచ్చాయి కదా. ఎందుకు ఏడుస్తున్నావు?" అడిగారు.

"నేను రూముకి వెళతా" వెంటనే గదికి వెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చాను. ఏడుపు కాస్త తగ్గాక అన్నయ్యకి ఫోన్ చేసాను.

"ఎందుకు ఏడుస్తున్నావు? అంతా బాగానే ఉందా?" అన్నయ్య అడిగాడు.

నిజమే కదా అనిపించింది. వెంటనే ఏడుపు ఆగింది. ధైర్యం పెరిగింది. ఇకమీద బాగా చదువుకోవాలి అనే తపన పెరిగింది. అన్నయ్యతో మాట్లాడ్డం పూర్తవ్వగానే మళ్ళీ నిద్రలోకి జారుకున్నాను. లేచేసరికి అంతా చీకటి. టైం ఎంతైందో కనిపెట్టలేకపోయాను. మర్నాడు అయ్యుంటుందని అనిపించింది. ఫోన్ వెతికి టైం చూసాను. రాత్రి తొమ్మిదైంది. అదే సమయానికి నేహా నా తలుపు కొట్టింది. లోపలికి వచ్చి నన్ను చూసి "ఈజ్ ఎవ్రిథింగ్ ఆల్రైట్?" కగారుగా అడిగింది.

"యస్. వై?" అన్నాను.

"యువర్ ఐస్ ఆర్ స్వోలెన్" అంది.

అద్దంలో మొహం చూసుకుని భయపడ్డాను. కళ్ళు రెండూ వాచడమేకాక ఎర్రగా అయిపోయాయి. వెంటనే మొహం కడుక్కున్నాను. బయటికి వెళ్ళేసరికి నేహ ఒక టవల్ ఇచ్చి కళ్ళమీద పెట్టుకోమంది. అది వేన్నీళ్ళలో నానపెట్టిన టవల్. తను చెప్పినట్టే పెట్టాను. ఎంతో హాయిగా అనిపించింది.

"టెల్ మీ. వాట్ హేపెండ్" అడిగింది.

నేను అన్నయ్య దగ్గరికి వెళ్ళడం, ఆ హెవెన్ ప్లేస్, స్కీయింగ్ గురించి చెప్పాను. తరవాత విమానంలో ఏడుపు, ఏ మైనస్ రావడం గురించి చెప్పాను.

తనకి ఫస్ట్ సెమిస్టర్‌లో చాలా తక్కువ గ్రేడ్స్ వచ్చాయని చెప్పింది. తను అమెరికాకి వచ్చిన రెండు నెలలకి వాళ్ళ అన్నయ్యకి ఏక్సిడెంట్ అయ్యిందట. డాక్టర్లు 50 – 50 చాన్సెస్ అని చెప్పారట. దాంతో తను క్లాసులకి వెళ్ళకుండా ప్రెయర్ చేస్తూ చాలా రోజులు గడిపి, అన్నయ్యకి నయం అయ్యాక వెంటనే సెమిస్టర్ మధ్యలో ఇండియాకి వెళ్ళింది. తిరిగి వచ్చిన వారానికి ఫైనల్ ఎగ్జామ్స్ అవ్వడంతో సరిగ్గా చదవలేక ఒక దాంట్లో 'సి,' రెండిట్లో 'బి' మైనస్ వచ్చాయట. ఆ తరవాత సెమిస్టర్ ఎంతో కష్టపడి మంచి గ్రేడ్లు తెచ్చుకుంది. ఆ తరవాతనుండి అన్నీ 'ఏ' అవ్వడంతో జి పి ఏ కూడా బాగానే ఉందని చెప్పింది. అది విని తన మీద గౌరవం పెరిగింది. తన స్థానంలో నేను ఉంటే అంత ధైర్యంగా ఉండగలిగేదాన్ని కాదు. అలాంటి బాధని అనుభవించిన ఇంత పాజిటివ్‌గా ఉండడం కష్టమే కాబోలు.

ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ టైం చూసుకోలేదు. బయట కాస్త వెలుతురు వచ్చింది.

"ఇట్స్ ఆల్మోస్ట్ సన్‌రైజ్" ఆశ్చర్యపోయాను.

"ఆర్ యు స్లీపీ?" అడిగింది.

లేదని చెప్పాను.

"కమాన్ లెట్ గో ఫర్ ఏ వాక్" అని సాక్స్ వేసుకుంది.

ఈ టైములో వాక్ అంటే మామూలుగా రానని చెప్పేదాన్ని. కానీ మా సంభాషణల వల్ల నాకు కూడా కాస్త బయటకి వెళ్ళాలనిపించింది.

ఇద్దరం కాంపస్‌లో నడవసాగాము. మారుమూల స్టేడియం దాకా వెళ్ళాము. దెయ్యాలంటే భయమా అని అడిగింది. లేదని చెప్పాను.

"లెట్స్ గో" అంటూ ఓ బిల్డింగ్‌లోకి తన ఐడీతో తలుపు తెరిచింది. నేను తనవెంటే వెళ్ళాను. మెట్లెక్కుతూ, నవ్వుతూ ఫోర్త్ ఫ్లోర్‌లోకి వెళ్ళాము.

"దిస్ ఫ్లోర్ ఈజ్ హాంటెడ్" అని చెప్పింది.

"రియల్లీ?"అడిగాను.

తలూపింది. నలభై ఏళ్ళ క్రితం ఈ ఫ్లోర్ కిటికీనుండి ఎవరో దూకి చనిపోయారట. అప్పటినుండి రోజూ రాత్రిళ్ళు ఆ బిల్డింగ్ నుండి పాటలు వినబడ్డాయట. అందరూ భయపడటంతో ఆ బిల్డింగ్ చాలాకాలం మూసేసి, తిరిగి ఈమధ్య కాలంలోనే తెరిచారని చెప్పింది. అమెరికా దెయ్యాలు కూడా మనలాగే పాటలు పాడతాయని ఆశ్చర్యపోయాను. ఇద్దరం కలిసి కెఫెటేరియాలో ఐస్క్రీం తిని ఇంటికి బయలుదేరాము. నేహ తన బాయ్‌ఫ్రెండ్‌తో ఏదో ఫేర్‌కి వెళుతున్నానని చెప్పింది.

"డు యు వాంట్ టు కం?" అడిగింది.

"నో, ఐవిల్ స్లీప్"అన్నాను

తను తయారయి వెళ్ళాక నేను స్నానం, పూజ పూర్తి చేసి హనీష దగ్గరికి వెళ్ళాను.

"నిన్న ఏడుస్తూ వెళ్ళిపోయావట? అందరూ వర్రీ అవుతున్నారు నీ గురించి" అంది.

చిన్నబోయాను.

"నువ్వు ఏ మైనెస్ కే అంత ఫీల్ అవుతున్నావు. మా గ్రూప్‌లో ఒకరికి బి ప్లస్ అట. నువ్వు ఏ మైనస్ అని వెళ్ళిపోయేసరికి అతను చాలా ఫీల్ అయ్యాడట. లైబ్రరీలోనే ఉన్నాడట" నవ్వుతూ చెప్పింది.

"ఔనా? నిజంగానా?" ఆశ్చర్యపోయాను.

ఇక్కడ మనుషులు ఎంత విచిత్రంగా ఉన్నారో అని కొద్దిసేపు మాట్లాడాము. ఆ తరవాత హాంటెడ్ బిల్డింగ్ గురించి మాట్లాడుకున్నాము.

"రేపటినుండి క్లాసులు మొదలు" దిగులుగా అంది.

"ఇంకా కొన్ని రోజులు సెలవలుంటే బావుండేది" అన్నాను.

"ఇంక ఎక్కువ రోజులు ఉంటే బోర్ కొడుతుందిలే" అంది.

"రేపు నా ప్రొఫెసర్‌తో మీటింగ్ ఉంది" అన్నాను.

"ఎలా అవుతుంది థీసెస్?"

"ఇంకా లిటరేచర్ రివ్యూనే చేస్తున్నాను. హోప్‌ఫుల్లీ రేపు ఆయన ఓకె అనాలి నా టాపిక్."

"అంటారులే. మా ప్రొఫెసర్‌ని మించినాయన అని విన్నాను."

"హోప్ ఫుల్లీ. సరేలే నేను ఇంక వెళతాను."

"సర్ కావాలంటే డిన్నర్‌కి వచ్చేయి"

"సరే మెసేజ్ చేస్తాను"

గదిలోకి వెళ్ళిపోయాను.

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

Click here to share your comments on this story